ప్రజలందరికీ 'ఆరోగ్య సురక్ష'

- నేటి నుంచి జోన్‌–5లో వైద్య శిబిరాలు
- పూర్తయిన ఏర్పాట్లు


జైభారత్‌నగర్‌లో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది


బాపూజీనగర్ యూపీహెచ్‌సీలో వైద్యశిబిరాలపై సమీక్షిస్తున్న జెడ్సీ ఆర్‌జీవీ కృష్ణ

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తోంది. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పక్కాగా నిర్వహించేందుకు జోన్‌–5కు సంబంధించి యూపీహెచ్‌సీలు సిద్ధం చేశామని జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ తెలిపారు. ఈ మేరకు సంబంధిత పబ్లిక్‌హెల్త్, వైద్య అధికారులతో జెడ్సీ కృష్ణ సమీక్షించారు. జోన్‌–5 పరిధిలోని యూపీహెచ్‌సీలు బాపూజీనగర్, ములగాడ, కంచరపాలెం (ఆర్పీపేట), కప్పరాడ, రైల్వే న్యూకాలనీ, నరసిం హనగర్, ఇందిరానగర్, శివనగర్, విద్యుత్‌నగర్ (ఎన్‌జీజీవో కాలనీ), అంబేడ్కర్‌కాలనీ, భవానీగార్డెన్స్, ఏఎస్‌ఆర్ నగర్, ఏకేసీ కాలనీ, గాంధీజీవీధి (మల్కాపురం), జ్ఞానాపురం యూపీహెచ్‌సీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. రక్తపోటు (బీపీ), షుగర్ పరీక్షలు చేయనున్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధపడేవారిని జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో గుర్తించారు. జోన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల బరువు తక్కువ, రక్తహీనత, ఎదుగుదల లోపం గల పిల్లలను గుర్తించి మందులు అందించనున్నారు. క్రానిక్ వ్యాధులైన క్యాన్సర్, గుండెపోటు, కిడ్నీ సమస్యలు లాంటివి గుర్తించి ఆయా యూపీహెచ్‌సీ పరిధిలోని జరిగే వైద్య శిబిరాలకు టోకెన్లు అందించామని పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు, అవసరమైతే ఉన్నత వైద్యశాలలకు తరలించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సిద్ధం చేశామని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళవారం పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఆరోగ్య సిబ్బందితో కలిసి జెడ్సీ కృష్ణ పలు వార్డుల్లో పర్యటించి యూపీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది చేస్తున్న జేఏఎస్ సర్వేను, టోకెన్ల జారీని పరిశీలించారు.

వైద్యశిబిరాలు నిర్వహించే ప్రాంతాలు..

- బుధవారం బాపూజీనగర్ యూపీహెచ్‌సీ ప్రాంగణం
- గురువారం ములగాడ యూపీహెచ్‌సీ, మల్కాపురం
- 6న కంచరపాలెం(ఆర్పీపేట) రైల్వేగేటు వద్ద
- 7న రైల్వేన్యూకాలనీ యూపీహెచ్‌సీ సుబ్బలక్ష్మి కల్యాణమండప ప్రాంగణం
- 10న ఇందిరాకాలనీ యూపీహెచ్‌సీ, సరస్వతి స్కూల్ గ్రౌండ్, పవనపుత్ర కాలనీ
- 11న శివనగర్ యూపీహెచ్‌సీ ప్రాంగణం, మర్రిపాలెం
- 13న నరసింహనగర్ యూపీహెచ్‌సీ అక్కయ్యపాలెం
- 16న అంబేడ్కర్‌కాలనీ యూపీహెచ్‌సీ మాధవస్వామి కల్యాణమండపం మాధవధార
- 17న భవానీగార్డెన్స్ యూపీహెచ్‌సీ ప్రాంగణం, ఐటీఐ జంక్షన్
- 18న ఏఎస్‌ఆర్‌నగర్–02 యూపీహెచ్‌సీ ప్రాంగణం, మురళీనగర్
- 19న గాంధీజీవీధి యూపీహెచ్‌సీ, మరిడిమాంబ కల్యాణమండపం, మల్కాపురం
- 20న నక్కవానిపాలెం యూపీహెచ్‌సీ ప్రాంగణం
- 21న ఏకేసీ కాలనీ, యూపీహెచ్‌సీ ప్రాంగణం
- 24న ఇందిరానగర్ –3 యూపీహెచ్‌సీ క్రాంతినగర్
- 26న కప్పరాడ యూపీహెచ్‌సీ ప్రాంగణం
- 30న జ్ఞానాపురం యూపీహెచ్‌సీ జోన్‌–5 ప్రాంగణం

టోకెన్లు జారీ చేశాం



జోన్‌–5 పరిధిలో 16 యూపీహెచ్‌సీల్లో బుధవారం నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ఆరోగ్య సిబ్బందికి విధులు కేటాయించాం. ఇప్పటికే సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి టోకెన్లు జారీ చేశాం. జేఏఎస్ వైద్యశిబిరాలు జరిగే 45 రోజుల పాటు ఆరోగ్య సిబ్బంది విధులకు కచ్చితంగా హాజరుకావాలి. వైద్యశిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించాం.

–డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏఎంహెచ్‌వో, పబ్లిక్‌హెల్త్, జోన్‌–5,

వైద్య శిబిరాలను విజయవంతం చేయాలి



45 రోజులు పాటు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను జోన్ పరిధిలోని 13 వార్డుల్లో ఏర్పాటు చేశాం. బుధవారం నుంచి ప్రారంభం కానున్న జేఏఎస్ వైద్యశిబిరాలు విజయవంతం చేయడంలో యూపీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, జోనల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు ఆయా పార్టీల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలి.

–ఆర్‌జీవీ కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్‌–5, జ్ఞానాపురం.

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన భరోసా

జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు


మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కార్యకర్తలు

గోపాలపట్నం: దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కోరారు. మంగళవారం గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఆరోగ్య పరీక్షలు చేస్తారని అందుకు సహకరించాలని కోరారు. అలాగే ఆరోగ్య శిబిరాల్లో అందరూ పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ శిబిరంలో 7 మంది వైద్య నిపుణులు వచ్చి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. ప్రజల ఆరోగ్యం బాగుంటే రాష్ట్రం ఆరోగ్యకర వాతావరణంలో ముందుకు సాగుతుందని సీఎం వైఎస్ జగన్ ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు గేదెల మురళీకృష్ణ, రాజేష్, కోదండరావ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

మల్కాపురం : స్టీల్‌ప్లాంట్‌ను బడా బాబులకు విక్రయించాలని నరేంద్రమోదీ సర్కార్ ఆలోచిస్తోందని, దీనిని మనమంతా వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.జగ్గునాయుడు అన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆటోల ద్వారా ప్రచారంతో పాటు హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కొన్నాళ్ల నుండి ప్లాంట్ కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమాలు జరుపుతూ, పోరాటాలకు సంఘీభావం తెలుపుతున్నామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 5న స్టీల్‌ప్లాంట్ వద్ద జరగబోయే భారీ సభకు సీపీఎం భారత జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రానున్నారని అన్నారు. ఈ సభకు భారీ ఎత్తున కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణతో దశాబ్దాల కల సాకారం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- రూ.7.75 కోట్లతో పనులు


రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్, మేయర్ హరి వెంకట కుమారితో కలిసి శంకుస్థాపన చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సబ్బవరం: దీర్ఘకాలంగా ఉన్న నంగినారపాడు ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష రోడ్డు విస్తరణతో నెరవేరనుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని నంగినారపాడు శివారు కొత్తూరులో రూ.7.75 కోట్ల జీవీఎంసీ నిధులతో విస్తరించనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో కలిసి మంత్రి అమర్‌నాథ్ మంగళవారం రాత్రి శంకుస్థాపన చేసారు. ఈ రోడ్డును కొత్తూరు నుంచి నంగినారపాడు హైస్కూల్ వరకూ నాలుగు దశల్లో విస్తరించనున్నట్టు చెప్పారు. కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారని 10 రోజుల్లో పనులు పూర్తిస్థాయిలో ప్రారంభమై యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. రోడ్డు పూర్తయితే పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. పరిసర ప్రాంతాలన్నీ నివాసయోగ్య ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేసినప్పటికీ కరోనా రావడంతో విస్తరణ పనులు నిలిచిపోయాయన్నారు. ఈ రోడ్డు పూర్తి చేసిన తర్వాతే వచ్చి ఓట్లు అడుగుతామని అన్నారు.

మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్‌రెడ్డి విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు భారీ ఎత్తున అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, పార్టీ వార్డు ఇన్‌చార్జి మహాలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ బొప్ప నాగరాజు, సచివాలయ కన్వీనర్ సర్వసిద్ధి బోరయ్య, నాయకులు బొట్ట ముత్యాలరావు, నారపిన్ని అప్పలరాజు,చట్టి తాతారావు, మళ్ల నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు జేసీకి వినతి


జేసీ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న దాడి సత్యనారాయణ

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో జరుగుతున్న విస్తరణ పనుల్లో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ వినతి పత్రం అందించారు. కాంట్రాక్టర్లు హెచ్‌పీసీఎల్‌లో స్థానికేతురులకే అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారని అన్నారు. దీని వల్ల స్థానిక యువత ఎలాంటి ఉపాధి లేకుండా ఉండిపోతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిశ్రమలలో స్థానిక నిరుద్యోగులకు 70 శాతం ఉపాధి కల్పించాలని ఆదేశించినా కాంట్రాక్టర్లు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఈ సమస్యపై స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు లాంగ్ సర్వీస్ అవార్డులు


ఉద్యోగికి అవార్డు అందజేస్తున్న జీఎం చిట్టిబాబు, అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు మంగళవారం లాంగ్ సర్వీసు అవార్డులు అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లో 25ఏళ్లు పూర్తి చేసుకున్న ఇద్దరు ఉద్యోగులకు ఆయా విభాగాల్లో ఈ అవార్డులను బహూకరించారు. హెచ్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో ఏసీఎస్ విభాగం కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఏసీఎస్ విభాగం ఏజీఎం ఈ.భిక్షంకు జీఎం డాక్టర్ వి. చిట్టిబాబు 150 గ్రాముల సిల్వర్ కాయిన్, సర్వీస్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ బి. జోగారావు ఏసీఎస్ అధికారులు ఎం.కె.వి.ఆర్. మోహన్‌రావు, పి. సుధాకరబాబు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం


964వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: వేలాది మందికి ఉపాధినిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఇందుకోసం కార్మికులతో కలసి ఐక్యంగా పోరాడతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 964వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారన్నారు. కానీ నేటి పాలకులు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదప్రజల జీవితాలను నాశనం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనాథ శవానికి అంతక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖ విద్య: అనాథ శవానికి మమత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. కేజీహెచ్‌లో 70 ఏళ్ల వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు బంధువులెవరూ రాకపోవడంతో ఆస్పత్రి నిర్వాహకులు మమత చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎల్లేటి మమతకు సమాచారం ఇచ్చారు. ట్రస్టు సభ్యుడు అనిమిరెడ్డి రమణతో కలసి ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని తీసుకొచ్చి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో మమతను పలువురు అభినందించారు.

టైర్ల జీవితకాలం పెరిగే విధంగా బస్సులు నడపాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డిపో మేనేజర్ ప్రవీణ

మల్కాపురం: ఆర్టీసీ డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తే టైర్ల జీవితకాలం పెరుగుతుందని, తద్వారా మరిన్ని కిలోమీటర్లు మనం సురక్షితంగా ప్రయాణించవచ్చునని గాజువాక ఆర్టీసీ డిపో మేనేజర్ వి.ప్రవీణ అన్నారు. టైర్ కేర్ పక్షోత్సవాల్లో భాగంగా డిపో వద్ద డ్రైవర్లకు ఆమె మంగళవారం అవగాహన కల్పించారు. గతుకల రోడ్డుపై వేగం తగ్గించడం ద్వారా టైర్ లైఫ్ పెరుగుతుందన్నారు. విధి నిర్వహణలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చడం బాధ్యత అని గుర్తించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో అధికారులు,కార్మికులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెం శ్రీకృష్ణ దేవరాయ సంక్షేమ సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని సంఘ సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా వసుపురెడ్డి నర్సింగరావు, గౌరవాధ్యక్షుడిగా లంకి అప్పలరాజు, కార్యదర్శిగా బుదిరెడ్డి రామారావు, కోశాధికారిగా అక్కిరెడ్డి వెంకటరమణ, సంయుక్త కార్యదర్శిగా అక్కడిరెడ్డి శంకరరావుతో పాటు సభ్యులు ఎన్నికయ్యారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం


యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

పోరాటాలతోనే మహిళాభ్యున్నతి


మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విమల

మల్కాపురం: పోరాటాలతోనే మహిళాభ్యున్నతి సాధ్యమని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అత్తిలి విమల అన్నారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గ్రామమండలి వద్ద సమాఖ్య సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ దేశంలో పెరిగిన గ్యాస్ ధరలు తగ్గాయంటే దానికి తాము చేసిన పోరాటమే కారణమన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై తమ సంస్థ అనేక పోరాటాలు చేసి మంచి ఫలితాలు సాధించిందన్నారు. మహిళల రక్షణకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముందు సమాఖ్య జెండాను ఆమె ఎగురవేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షురాలు బేగం, జిల్లా నాయకులు దేవుడమ్మ, సమితి సభ్యులు అన్నపూర్ణ, జయ, నాగభూషణం, రమణమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి 'ఆడారి' కృషి


పార్టీ కార్యకర్తలతో పుర్రె సురేష్ యాదవ్

మల్కాపురం: గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అభివృద్ధి చేశారని ఇండ్రస్టియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్ అన్నారు. వార్డు పరిధి ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద వార్డు నాయకులు, కార్యకర్తలతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మనసున్న మంచి మనిషి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. పశ్చిమ పరిధిలోనే కాకుండా జిల్లా నలుమూలల ఆయన స్థాపించిన ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. పార్టీలకు అతీతంగా ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన ప్రతి ఒక్కరు వచ్చే ఎన్నికల్లో ఆయనకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. 59వ వార్డు పరిధి నాయకులు, కార్యర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు, పలు అనుబంధ సంస్థల ప్రతినిధులు ఆడారి ఆనంద్‌కుమార్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే కాక ముందే ఆయన ఇలా అభివృద్ధి చేస్తుంటే.. ఎమ్మెల్యే అయితే పశ్చిమ నియోజకవర్గం జిల్లాకే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్‌కుమార్, ఖాన్, పెంటారావు, రేవళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై వ్యాపారులకు అవగాహన


మాట్లాడుతున్న ఏడీసీపీ శ్రీనివాసరావు

గోపాలపట్నం/మల్కాపురం: ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్ సూచించారు. మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం దుకాణదారులు, తోపుడు బళ్ల వ్యాపారులు, ఆటో డ్రైవర్లకు రహదారి నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ తోపుడు బళ్లు, కొబ్బరి బోండాల, పండ్ల బళ్ల వ్యాపారులు, ఆటో డ్రైవర్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని సూచించారు. ఆటోలు ఎక్కడికక్కడ పార్కింగ్ చేయడం.. ప్రయాణికుల కోసం రోడ్లపై నిలిపి వేయడం వంటివి చేయరాదని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు నిబంధనలు పాటించాలని సూచించారు.

అసభ్యంగా ప్రవర్తిస్తే సమాచారం ఇవ్వండి

సీఐ దేముడుబాబు


మాట్లాడుతున్న సీఐ జి.డి.బాబు

మల్కాపురం: ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా.. తప్పుడు సందేశాలు పంపినా తనకు ఒక్క ఫోన్ చేస్తే చాలు అని మల్కాపురం సీఐ జి.డి. బాబు సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల విద్యార్థినులకు అభయ హస్తం ఇచ్చారు. కళాశాలలో మంగళవారం నేరాల జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతరుల నుంచి వచ్చే ఇబ్బందులను ఎలా అధిగమించాలి అనే పలు అంశాలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. చుట్టుపక్కల ప్రదేశాల్లో ఎవరైనా డ్రగ్స్ సేవించి ఉన్నట్టు గుర్తించినా.. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు తెలిసినా వెంటనే తనకు ఫోన్ చేయాలన్నారు.నేరస్తులు పలు విధాలుగా మోసాలకు పాల్పడతారని.. తెలియని వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాసంస్థల ప్రతినిధులతో ట్రాఫిక్ సీఐల సమావేశం


విద్యా నిలయాల యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్


కంచరపాలెం ట్రాఫిక్ స్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ మళ్ల అప్పారావు

- ట్రాఫిక్ సమస్యలపై అవగాహన కార్యక్రమం
- కంచరపాలెం, గోపాలపట్నం ట్రాఫిక్ స్టేషన్లలో సమావేశాలు

గోపాలపట్నం : కంచరపాలెం, గోపాలపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో సీఐలు మళ్ల అప్పారావు, అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పీక్ సమయాల్లో పలు జంక్షన్లలో రద్దీ ఎక్కువగా ఉంటోందని దాన్ని నియంత్రించేందుకు సహకరించాలని కోరారు. స్కూల్ బస్సులు, ఆటోల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మంది విద్యార్థుల్ని ఎక్కించరాదన్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో పాఠశాల తెరవడం, విడిచిపెట్టే సమయాల్లో కొద్దిపాటి తేడా పాటించాలని సూచించారు. ఎస్ఐలు శ్రీనివాసరావు, వాసుదేవరావు, పలు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా iti.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8న నిర్వహించనున్న వెరిఫికేషన్‌కు హాజరు కావాలని తెలియజేశారు. ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 9న ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.